# ఫండమెంటల్ రూల్సు - ఫిక్సేషన్లు, ఇంక్రిమెంట్లు

ఒక ఉద్యోగి వేరొక పోస్టునందు నియమించబడినప్పుడు లేక ప్రమోషను పొందినప్పుడు ఫండమెంటల్ రూల్స్ 22,30,31 ననుసరించి అతని వేతన స్థిరీకరణ జరుగుతుంది. అయితే ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులిచ్చిన సందర్భంలో బాధ్యత మార్పుతో సంబంధం లేకుండగనే ఈ నిబంధనల ప్రకారము వేతన స్థిరీకరణ చేయబడుతుంది. సెలక్షన్ గ్రేడు, 6/12/18/24 సంవత్సరముల స్కేల్సు, రివైజ్డ్ పే స్కేల్సు, మొ॥వానియందు ఆ విధంగానే వేతన స్థిరీకరణ చేయ బడుచున్నది.

అట్లే ఉద్యోగి యొక్క సర్వీసును బట్టి ఇంక్రిమెంట్లు మంజూరు చేయబడతాయి. వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు, ప్రీపోన్మెంటు, పోస్టు పోన్మెంటు మొదలుగునవి ఫండమెంటల్ రూల్సు 24,26,27ననుసరించి చేయబడతాయి.

**F.R.22(a) (i) :** అదనపు బాధ్యతలతో కూడిన పోస్టునందు నియమించబడినప్పుడు, నూతన స్కేలు నందలి 'తదుపరి పై స్టేజి' వద్ద వేతన స్థిరీకరణ జరుగును. అట్టి వేతన స్థిరీకరణ జరిగిన తేదీ నుండి 12 నెలల సర్వీసు నిండిన పిదప ఇంక్రిమెంటు ఇవ్వబడుతుంది.

ఉదా : 10,900-31,550 స్కేలులో రూ. 11,860/- వేతనము తీసుకొనే ఉద్యోగి 14,860-39,540 స్కేలు గల పోస్టులో నియమించబడినప్పుడు అతని వేతనము రూ. 14,860గా స్థిరీకరించబడుతుంది.

**F.R.22(a) (ii) :** అదనపు బాధ్యతలు లేని పోస్టునందు నియమించబడినప్పుడు, నూతన స్కేలు నందలి 'దిగువ స్టేజి' వద్దనే వేతన స్థిరీకరణ జరుగుతుంది. అయితే -

ఎ) ఒకవేళ పాత స్కేలులోని మూల వేతనమునకు సరిసమానమైన స్టేజి నూతన స్కేలులో వున్నచో అట్టి 'సమాన స్టేజి' వద్ద వేతన స్థిరీకరణ జరుగుతుంది. పాత ఇంక్రిమెంటు తేదీ కొనసాగుతుంది.

**ఉదా :** 5470-12385 స్కేలులో రూ. 7385/-లు వేతనం పొందుతున్న ఉద్యోగి 7200- 16925 స్కేలులో నియమించబడినప్పుడు అతని వేతనము రూ. 7385ల వద్దనే స్థిరీకరించబడుతుంది.

బి) ఒకవేళ పాత స్కేలులోని మూలవేతనమునకు సమానమైన స్టేజి లేనిచో దిగువ స్టేజి వద్ద వేతన స్థిరీకరణ జరుగుతుంది. వేతన వ్యత్యాసము 'పర్సనల్ పే'గా నమోదు చేయబడుతుంది. పాత ఇంక్రిమెంటు తేదీ కొనసాగుతుంది. (93,99,05,10 స్కేళ్ళలో అన్నీ సమాన స్టేజీలే వుంటాయి. కనుక 86 స్కేళ్ళలో ఉదా ॥ చూడాలి)

**ఉదా :** 1010-1800 స్కేలులో రూ. 1360/-లు పొందుచున్నచో 1280-2440 స్కేలులో రూ. 1330+30 పిపిగా వేతన స్థిరీకరణ జరుగుతుంది.

సి) పాత స్కేలులోని మూలవేతనము నూతన స్కేలు యొక్క మినిమం కంటే తక్కువగా నున్నప్పుడు అట్టి మినిమం వద్ద వేతన స్థిరీకరణ జరుగుతుంది. సంవత్సరం సర్వీసు తదుపరి మాత్రమే ఇంక్రిమెంటు ఇవ్వబడుతుంది.

**ఉదా :** రూ. 10,900-31,550 స్కేలులో రూ. 11,860/-లు పొందుచున్నచో, 14860-39540 స్కేలులో రూ. 14,360/- వద్ద వేతన స్థిరీకరణ జరుగుతుంది.

**F.R.22(a) (iii) :** ఉద్యోగి కోరికపై క్రింది స్థాయి పోస్టులో నియమించబడినప్పుడు అతని వేతనము ఎఫ్ఆర్ 22(ఎ) **(iii)**లోని విధానము ననుసరించి స్థిరీకరించబడుతుంది.

**F.R.22(a) (iv) :** ఉద్యోగి పబ్లిక్ సర్వీస్ కమీషన్‌చే ఎంపిక చేయబడిన మరొక పోస్టులో నేరుగా నియమించ బడినప్పుడు పాత పోస్టులోని వేతనమునకు తక్కువ కాకుండా క్రొత్త పోస్టులోని వేతనము స్థిరీకరించబడుతుంది.

**F.R.22 B** : నిబంధన ననుసరించి వేతన స్థిరీకరణ రెండు విధములుగా చేయవచ్చును. వాస్తవ ప్రమోషన్ తేదీనాడైనను లేక ప్రమోషన్ పొందిన పిదప క్రింది పోస్టులోని తదుపరి ఇంక్రిమెంటు తేదీనాడైనను వేతన స్థిరీకరణ చేయవచ్చును. జిఓ.ఎంఎస్.నం. 145, తేది. 19.05.2009 ప్రకారము ఉద్యోగి ఎటువంటి ఆప్షన్ ఇవ్వకుండగనే ఉద్యోగికి ప్రయోజనకరమైన విధముగా ప్రమోషన్ తేదీ లేక తదుపరి ఇంక్రిమెంటు తేదీలలో దేనికైననూ వేతన నిర్ణయం చేయవలెను.
**ఉదా :** 10900-31550 స్కేలులో రూ. 14,400/-లు వేతనం పొందుతూ పదోన్నతి పొందినచో పదోన్నతి పొందిన రోజున వేతనం రూ. 14,860/-లుగా ఎఫ్ఆర్ 22ఎ(1) ప్రకారం నిర్ణయించి తదుపరి ఇంక్రిమెంటు తేదీ నాటికి ఒక నోషనల్ ఇంక్రిమెంటు రూ. 420/-లు కలిపి వేతనాన్ని రూ. 14,860-39,540 స్కేలులో తదుపరి స్టేజి వద్ద అనగా రూ. 15,700/-లుగా వేతన స్థిరీకరణ జరుగుతుంది.

**F.R.31 (2)** : నిబంధన ఎఫ్ఆర్ 22కు అనుబంధమైనది. దీని ప్రకారం సబ్‌స్టాంటివ్ (క్రింది) పోస్టులో కొనసాగి వుంటే ఇంక్రిమెంటు మంజూరు వలన గాని లేక ఇతర మంజూరుల వలనగాని ఆ స్కేలులోని వేతనము పెరిగినచో, అట్టి పెరుగుదల తేదీన అఫిషియేటింగ్ (పై) స్కేలులోని అతని వేతనము తదుపరి పై స్టేజి వద్ద పున్నస్థిరీకరణ చేయబడుతుంది. లాభకరమైనప్పుడు)
**ఉదా :** 10900-31,500 స్కేలులో రూ. 15,280/-లు పొందుచున్న ఉద్యోగి వేతనము 14860-39540 స్కేలులో రూ. 15,700/-ల వద్ద స్థిరీకరణ జరుగుతుంది. అయితే పాత స్కేలులోని ఇంక్రిమెంటు వలన వేతనము రూ. 15,700/-లుగా పెరుగుతుంది. కనుక సదరు ఇంక్రిమెంటు తేదీన క్రొత్త స్కేలులో అతని వేతనము 16,150/- వద్ద పున్నస్థిరీకరణ చేయ బడుతుంది.

**F.R.26** : నిబంధన ననుసరించి వార్షిక ఇంక్రిమెంటు మంజూరు చేయబడును. వార్షిక ఇంక్రిమెంటు మంజూరుకు - ఒక పోస్టులోని డ్యూటీ కాలము, జీత నష్టములేని సెలవు కాలము, ఫారిన్ సర్వీసు కాలము, జాయినింగ్ కాలము మొదలగునవి లెక్కించబడతాయి. అనారోగ్య కారణముపైగాని, ఉన్నత శాస్త్ర, సాంకేతిక విద్యనసభ్యసించు కారణముపైగాని పెట్టిన జీతనష్టపు సెలవు 6 నెలల కాలపరిమితికి లోబడి ఇంక్రిమెంటుకు పరిగణించబడుతుంది. అందుకుగాను సంబంధిత శాఖాధిపతి అనుమతిని పొందవలసి వుంటుంది. శిక్షా చర్యగా సస్పెండు చేయబడిన కాలము ఇంక్రిమెంటుకు లెక్కించబడదు.

**F.R.27** : నిబంధన ననుసరించి జూనియర్‌కంటే సీనియర్ తక్కువ వేతనము పొందుచున్న సందర్భములో - ప్రీమెచ్యూర్ ఇంక్రిమెంట్ (ప్రీపోన్మెంట్) మంజూరు చేయబడుతుంది. ఒక పోస్టును మంజూరు చేయు అధికారియే అట్టి ఇంక్రిమెంటును మంజూరు చేయు అధికారము గలిగి యుండును. అయితే ప్రభుత్వపు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా సదరు అధికారము దఖలు పరచబడిన సందర్భములో సంబంధిత క్రింది అధికారులు కూడా అట్టి ఇంక్రిమెంటును మంజూరు చేయవచ్చును. ప్రీపోన్మెంట్‌తోపాటు స్టెప్పింగ్ అప్ కూడా యీ నిబంధన క్రిందే చేయబడుతుంది.

**F.R.24** : నిబంధన ననుసరించి దుష్ప్రవర్తన గల లేక అసంతృప్తికరమైన విధముగా విధులను నిర్వహించుచున్నట్టి ఉద్యోగిపై శిక్షా చర్యగా ఇంక్రిమెంటును కొంత కాలము నిలుపు చేయవచ్చును. ఇంక్రిమెంటు మంజూరు చేయు అధికారియే అట్టి నిలుపుదల చేయవచ్చును. ఈ నిలుపుదల రెండు విధములు - 1. క్యుములేటివ్ ఎఫెక్టుతో - అనగా ప్రతి సంవత్సరము నిర్ణీత కాలము వాయిదా పడుతుంది. 2. క్యుములేటివ్ ఎఫెక్టు లేకుండా - అనగా ఆ ఒక్క సంవత్సరమునకు మాత్రమే నిర్ణీత కాలము వాయిదా పడుతుంది.

# తెలుసుకోదగిన ముఖ్య విషయాలు

1. **రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ :** డిఎస్‌సి చే సెలక్టు చేయబడిన ఉద్యోగుల సర్వీసు రెగ్యులరైజేషన్ వారి నియామకము తేదీ నుండి చేయబడుతుంది. పోలీసు యాంటిసిడెంట్స్ రిపోర్టు సకాలంలో రాని కారణంగా రెగ్యులరైజేషన్‌కు పెద్ద ఆటంకంగా వున్నది. రెగ్యులరైజేషన్ తేదీ నుండి మాత్రమే సీనియార్టీ పరిగణించబడుతుంది. రెగ్యులర్ సర్వీసు రెండు సంవత్సరాలు పూర్తయిన తరువాత ప్రొబేషన్ డిక్లరేషన్ చేయబడుతుంది. లోయరు క్యాడరులో రెగ్యులరైజేషన్ అయిన తదుపరి ప్రమోషన్ పొందితే ప్రత్యేకంగా రెగ్యులరైజేషన్‌తో పని లేకుండా సంవత్సరం సర్వీసు పూర్తయిన తరువాత ప్రొబేషన్ డిక్లరేషన్ చేయబడుతుంది. ప్రొబేషన్ డిక్లరేషన్ సకాలంలో చేయబడనప్పుడు డిక్లరేషన్ జరిగినట్లుగానే భావించబడుతుంది.
2. **స్టెప్పింగ్ అప్ ఆఫ్ పే :** సీనియరు – జూనియరు వేతన వ్యత్యాసము ఎఫ్ఆర్ 27 క్రింద సవరించబడుతుంది. అయితే అట్టి వేతన వ్యత్యాసమునకు వ్యక్తిగత ప్రత్యేకతలు కారణమై వుండరాదు. 10/15 సంవత్సరముల స్కేళ్ళను పొందిన తదుపరి ప్రమోషను పొందిన జూనియర్‌కంటే, సదరు స్కేళ్ళను పొందకుండానే ప్రమోషన్ పొందిన సీనియరు తక్కువ వేతనము పొందుతుంటే (జిఓ 297 ఆర్థిక, తేది. 25.10.1983 ననుసరించి) అట్టి సీనియరు వేతనమును జూనియరు వేతనముతో సమాన పరచుచూ స్టెప్పింగ్ అప్ చేస్తారు. అట్టే 10/15/22 సంవత్సరముల స్కేళ్ళను పొంది క్రింది పోస్టులోనే కొనసాగుతున్న జూనియర్ కంటే, సదరు స్కేళ్ళను పొందకమునుపే ప్రమోషను పొందిన సీనియరు తక్కువ వేతనము పొందుతుంటే వారి వేతనమును కూడా (జిఓ 75 ఆర్థిక, తేది. 22.02.1994 ననుసరించి) స్టెప్పింగ్ అప్ చేస్తారు. 2010 వేతన స్కేళ్లల్లో స్టెప్–అప్ సౌకర్యం పునరుద్ధరించబడినది. జిఓ 52 ఆర్థిక, తేది. 25.02.2010 ప్రకారం పై కారణాలరీత్యా 01.07.2008 నాటికి సీనియరు కంటే జూనియర్ ఎక్కువ వేతనం పొందుచున్న ఎడల ముందు స్టెప్ అప్ చేసి తదుపరి 2010 స్కేళ్లల్లో వేతన నిర్ణయం చేయాలి. జిఓ నం. 93 ఆర్థిక, తేది. 04.03.2010 ప్రకారం 2010 పీఆర్‌సీ అమలు తర్వాత సీనియర్, జూనియర్ స్కేళ్లలో వచ్చిన వేతన వ్యత్యాసము పైన ఉదహరించిన కారణాలరీత్యా ఉన్నట్లయితే దానిని జూనియర్ వేతనము ఎక్కువగా నిర్ణయించబడిన రోజు నుండి సీనియర్ వేతనం సమానం చేయబడును.
3. **ప్రీ పోన్మెంట్ :** 2010 వేతన స్కేళ్ళలో ప్రీపోన్మెంట్ సౌకర్యం పునరుద్ధరించబడినది. జిఓ.ఎంఎస్.నం. 52 ఆర్థిక, తేది. 25.02.2010 ప్రకారం 01.07.2008కి ముందు జూనియర్ వేతనము, సీనియర్ వేతనం కన్నా తక్కువగా ఉండి 2010 వేతన స్కేళ్ళలో ఇరువురికి వేతనం ఒకే స్టేజి వద్ద వేతన స్థిరీకరణ జరిగి జూనియర్ ఇంక్రిమెంట్ తేదీ ముందుగా ఉన్నప్పుడు సీనియర్ ఇంక్రిమెంట్ తేదీని కూడా జూనియర్ ఇంక్రిమెంట్ తేదీకి ప్రీపోన్ చేస్తారు.
4. **స్వస్థలము నమోదు :** సర్వీసు రిజిష్టరు రెండవ పేజీలో నమోదు వున్న నివాస స్థలమును బదిలీల సందర్భంలో స్వస్థలము (Native Place) పరిగణించుట వలన అనేకమంది నష్టపోవుట జరుగుచున్నది. ఈ స్థితిలో ఎల్‌టిసి వినియోగ సందర్భములో స్వస్థలము (Home Town)ను నమోదు చేయుటకు జిఓ 248 ఆర్థిక, తేది. 20.09.1982 (అ.ద. 8 పేజి 168)లో పేర్కొనిన విధానముచే ఉపాధ్యాయుల బదిలీల సందర్భములో స్వస్థలమును నమోదు చేయుటలోను పాటించవలసినదిగా పాఠశాల విద్యాసంచాలకులవారి ఉత్తర్వులు ఆర్‌సి.నం. 6371/సి2–1/2001, తేది. 06.11.2001 ద్వారా వివరణ ఇవ్వబడినది. అట్లే ప్రభుత్వ మెమో నం. 59852/ఎస్టా–VIII/87–1 పీఆర్‌సీ & ఆర్‌డి శాఖ, తేది. 31.07.1987ననుసరించి మహిళా ఉపాధ్యాయిని తన తల్లిదండ్రుల యొక్క లేక భర్త యొక్క స్వస్థలములలో ఏదొక దానిని తన స్వస్థలముగా ప్రకటించుకొనవచ్చునని కూడా పాఠశాల విద్యా సంచాలకుల వారి ఉత్తర్వులు ఆర్‌సి.నం. 6585/సి2–2/2001, తేది. 13.10.2001 ద్వారా వివరణ ఇవ్వబడియున్నది.
5. **అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ / హైకోర్టు :** ప్రభుత్వోద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకై "అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ చట్టం–1985" ననుసరించి ఏర్పాటైన క్రొత్త ట్రిబ్యునల్ 1989 నవంబరు 1 నుండి పనిచేస్తున్నది. కనుక "కంటెంప్ట్ ఆఫ్ కోర్టు అర్జీ" ద్వారా ఉద్యోగులు దాని తీర్పులను అమలు జరిపించుకోవచ్చు. అట్లే దాని తీర్పు నచ్చనప్పుడు హైకోర్టులో అప్పీలు చేసుకోనవచ్చును. ఎయిడెడ్ విద్యా సంస్థలు, అటానమస్ బాడీలకు చెందిన ఉద్యోగులు తమ పిటీషన్లను నేరుగా హైకోర్టులో మాత్రమే దాఖలు చేసుకోవాలి.

6. **వివిధ రకాల అలవెన్సులు :**

1) **డ్యూటీ అలవెన్సు :** ప్రధానోపాధ్యాయుల విధులను నిర్వహించినందులకు హెచ్ఎం అలవెన్సుగా పిలువబడే స్పెషల్ పే పాఠశాల స్థాయినిబట్టి యివ్వబడుతుంది. 2010 స్కేళ్ళ ప్రకారం ఏకోపాధ్యాయుడయితే రూ. 50/-లు, బహుళోపాధ్యాయ ప్రాథమిక పాఠశాల అయితే రూ. 75/-లు, ప్రాథమికోన్నత పాఠశాల అయితే రూ. 100/-లు చొప్పున చెల్లించబడుతుంది. కాగా హెచ్ఎం పోస్టు వున్న ఉన్నత పాఠశాలకు ఎఫ్ఏసిగా పనిచేస్తే ఎఫ్ఆర్ 49 ననుసరించి అడిషనల్ చార్జ్ అలవెన్సు యివ్వబడుతుంది. అది హెచ్ఎం పోస్టు యొక్క స్కేలు మినిమంలో 1/5 వంతున 3 నెలలు, 1/10 వంతున ఆ తదుపరి 3 నెలలు చెల్లించబడుతుంది. దానిపై డిఏ, హెచ్ఆర్ఏ కూడా అనుమతించబడతాయి. జిఓ నెం. 118 ఆర్థిక, తేది:7.4.2010.

2) **కన్వేయన్సు అలవెన్సు :** అంగవైకల్యము గలవారికి, గ్రుడ్డివారికి మూలవేతనములో 10% చొప్పున రూ. 900/-ల గరిష్ఠ పరిమితితో ప్రయాణ ఖర్చుల క్రింద చెల్లించబడుతుంది. 40% శాశ్వతమైన పాక్షిక అంగవైకల్యం గలవారు అర్హులు. ప్రభుత్వ సివిల్ సర్జను నుండి వైద్య ధృవపత్రమును పొందాలి. అట్టి వైద్య ధృవపత్రము కార్యాలయాధిపతికి చేరిన తేదీ నుండి యీ అలవెన్సు చెల్లించబడుతుంది. క్యాజువల్ సెలవులుగాక యితర సెలవుల కాలము, జాయినింగు కాలము, సస్పెన్షన్ కాలములకు యిది చెల్లించబడదు. జిఓ నెం. 108 ఆర్థిక, తేది:7.4.2010.

3) **రీడర్స్ అలవెన్సు :** గ్రుడ్డివారైన ఉపాధ్యాయులు బోధించుటలో సహాయకునికి రీడర్ అలవెన్సు సెకండరీ గ్రేడ్ వారికైతే రూ. 400/-లు, స్కూల్ అసిస్టెంట్లకైతే రూ. 500/-లు నెలకు చెల్లించబడుతుంది. జిఓ 34, మ&బా.స, తేది:16.7.2010.

4) **హైయ్యర్ క్లాసు అలవెన్సు :** క్యాటగిరీ IIIకి చెందిన ఉపాధ్యాయులు 8,9,10 తరగతులకు బోధించినందులకు నెలకు రూ. 100/-ల చొప్పున చెల్లిస్తారు. అయితే అందుకు తనిఖీ అధికారి ముందస్తు అనుమతి అవసరము. జిఓ నెం. 118, ఆర్థిక, తేది: 7.4.2010.

5) **స్కౌట్, ఎన్‌సిసి అలవెన్సు :** నెలకు రూ. 75/-ల చొప్పున చెల్లించబడుతుంది. జిఓ 133 ఆర్థిక, తేది: 24.4.2010.

6) **హెచ్ఆర్ఏ :** హెచ్ఆర్ఏ గరిష్ఠ పరిమితి 01.02.2010 నుండి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 6,000/- నుండి 12,000/-లకు ఇతర ప్రాంతాలలో రూ. 4,000/-ల నుండి రూ. 8,000/-లకు పెంపుదల చేశారు. జిఓ 64 ఆర్థిక, తేది: 9.3.2010

7) **విద్యా రాయితీ :** ఉద్యోగులు తమ పిల్లలు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఎల్.కె.జి. నుండి ఇంటర్ వరకు చదువుచున్నచో ఒక్కొక్కరికి రూ. 1000/-ల వంతున ఇద్దరు పిల్లల వరకు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుటకు అర్హులు. 2010 పీఆర్‌సీ స్కేళ్లలో అందరు నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు అర్హులు.

## అప్పులు అడ్వాన్సులు

**పండుగ అడ్వాన్సు :** 2010 పీఆర్‌సీస్కేళ్ళలో 13,360-38,370 స్కేలుగాని, అంతకు తక్కువ స్కేలుగాని కలిగియున్న ఉద్యోగులకు రూ. 3000/-ల చొప్పునను, 4వ తరగతి ఉద్యోగులకు రూ. 2000/-ల చొప్పునను పండుగ అడ్వాన్సు మంజూరు చేయబడుతుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకసారి మాత్రమే, ప్రభుత్వ సెలవు దినముగా ప్రకటించబడిన పండుగకు యీ అడ్వాన్సు యివ్వబడుతుంది. అది 10 సమాన వాయిదాలలో రికవరీ చేయబడుతుంది. జిఓ 175 ఆర్థిక, తేది: 15.05.2010.

**వివాహ అడ్వాన్సు :** 2010 పీఆర్‌సీలో పురుష ఉద్యోగి వివాహమునకు లేక ఉద్యోగి కుమారుని వివాహమునకు రూ. 50,000 చొప్పునను, మహిళా ఉద్యోగి వివాహమునకు లేక ఉద్యోగి కుమార్తె వివాహమునకు రూ. 75,000లు చొప్పున వివాహ అడ్వాన్సు మంజూరు చేయబడుతుంది. 4వ తరగతి ఉద్యోగులైతే పురుషులకు రూ. 30,000, స్త్రీలకు రూ. 50,000 మంజూరు చేయబడుతుంది. అడ్వాన్సు మొత్తం 70 వాయిదాలలోను, వడ్డీ 10 వాయిదాలలోను రికవరీ చేయబడుతుంది. వడ్డీ రేటు 4వ తరగతి ఉద్యోగులకు 5%, ఇతరులకు 5.5%గాను ఉంటుంది.

**విద్యా అడ్వాన్సు :** 2010 పీఆర్‌సీ స్కేళ్ళలో ఉద్యోగులకు రూ. 5000/-ల చొప్పున మంజూరు చేయబడుతుంది. కనీసం 2 సం॥ల సర్వీసు గల రెగ్యులర్ ఉద్యోగులు అర్హులు. తమ పిల్లల విద్యా ఫీజుకై మరియు పాఠ్య పుస్తకముల కొనుగోలు నిమిత్తం యీ అడ్వాన్సు కొరకు నిర్ణీత ఫారంలో దరఖాస్తు చేయాలి.

**గమనిక :** ఉద్యోగి మరణించిన సందర్భంలో పై 3 రకాల అడ్వాన్సుల తాలూకు రికవరీలు రద్దు చేయబడతాయి.

# వేతన స్థిరీకరణ - ఎఫ్ఆర్ 22బి ప్రాధాన్యత

25.12.1982 తదుపరి అదనపు బాధ్యతలుగల పోస్టునందు నియమించబడిన వారికి ఈ నిబంధన వర్తిస్తుంది. 1992,1998 పీఆర్‌సీ స్కేళ్ళలో 8 సం॥ స్కేలు పొందకుండానే ప్రమోషన్ వచ్చిన వారికి ఎఫ్ఆర్ 22బి ప్రకారము, 8/16 స్కేళ్ళు పొందుతూ ప్రమోషన్ వచ్చిన వారికి ఎఫ్ఆర్ 22ఎ(i) ప్రకారము వేతన స్థిరీకరణ చేయబడేది.

2005 పీఆర్‌సీ సిఫార్సులకు అనుగుణముగా యివ్వబడిన ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం జిఓ 241 ఆర్థిక, తేది. 28.09.2005 ద్వారా 8/16 సం॥ల స్కేళ్ళు పొందుతూ ప్రమోషన్ వచ్చిన వారికి కూడా ఎఫ్ఆర్ 22బి ప్రకారము వేతన స్థిరీకరణలో రెండు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. 2010 వేతన స్కేళ్ళలో ఆర్డినరీ, 6/12/18 స్కేళ్ళు పొందుతూ ప్రమోషన్ వచ్చిన వారికి ఎఫ్ఆర్ 22బి ప్రకారం వేతన స్థిరీకరణ జరుగుతుంది. (జిఓ 96 ఆర్థిక; తేది.20.05.2011)

దీని ప్రకారము క్రింది పోస్టులోని వేతనమునకు ఒక నోషనల్ ఇంక్రిమెంటు కలిపి సదరు వేతనము ఆధారముగా పై పోస్టు యొక్క స్కేలులోని తదుపరి స్టేజి వద్ద వేతన స్థిరీకరణ చేయబడుతుంది.

ఈ నిబంధన ప్రకారము వేతన స్థిరీకరణ రెండు విధాలుగా చేయవచ్చును. 1. వాస్తవ ప్రమోషన్ తేదీ నాడు గాని లేదా 2. క్రింది పోస్టులోని తదుపరి ఇంక్రిమెంటు తేదీనాడు గాని వేతన స్థిరీకరణ చేయవచ్చును. జిఓ.ఎంఎస్.నం. 145, ఆర్థిక, తేది. 19.05.2009 ప్రకారం ఉద్యోగికి లాభదాయకంగా ఉండే విధానంలో పై రెండింటిలో దేని ప్రకారమయిన ఉద్యోగి ఆప్షన్‌తో పనిలేకుండానే వేతన నిర్ణయం చేసే బాధ్యత డ్రాయింగ్ అధికారికి కల్పించబడింది. ఉదా: మార్చి నెల ఇంక్రిమెంట్ తేదీగా గల ఉపాధ్యాయుడు తేది. 31.01.2009న స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందినాడు. సదరు తేదీ నాటికి అతని వేతనము రూ. 11,530-33,200 స్కేలులో రూ. 14,400/-లుగా యున్నది. వీరి వేతనము ఎఫ్ఆర్ 22బి ప్రకారము రెండు విధాలుగా స్థిరీకించవచ్చును.

| | | |
|---|---|---|
| **1) ప్రమోషన్ తేదీనాడు వేతన స్థిరీకరణ :** | | |
| a) | తేది **31.01.2009** నాటికి ఎస్‌జిటి పోస్టులో మూల వేతనము మరియు స్కేలు | 14,440/-<br>11530-33200 |
| b) | ఎఫ్ఆర్ 22బి ప్రకారం ఒక నోషనల్ ఇంక్రిమెంటు మంజూరు | 14,800/-<br>11530-33200 |
| c) | స్కూల్ అసిస్టెంట్ స్కేలులో తదుపరి స్టేజీలో వేతన నిర్ణయము | 15,280/-<br>14860-39540 |
| d) | తదుపరి ఇంక్రిమెంటు తేదీ | 01.01.2010 |
| **2) క్రింది పోస్టులోని ఇంక్రిమెంట్ తేదీనాడు వేతన స్థిరీకరణ** | | |
| a) | తేది. **31.01.2009** నాటికి ఎస్‌జిటి పోస్టులో మూలవేతనము మరియు స్కేలు | 14,440/-<br>11530-33200 |
| b) | పదోన్నతి పొందిన రోజున ఎఫ్ఆర్ 22ఎ ప్రకారం వేతన నిర్ణయం | 14,860/- |
| c) | తేది. **01.03.2009**న ఎస్‌జిటి పోస్టులో వార్షిక ఇంక్రిమెంటు మంజూరు | 14,860/-<br>11530-33200 |
| d) | ఎఫ్ఆర్ 22బి ప్రకారం ఒక నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు | 15,280/-<br>11530-33200 |
| e) | స్కూల్ అసిస్టెంట్ పోస్టు స్కేలులో తదుపరి స్టేజిలో వేతన నిర్ణయము | 15,700/-<br>14860-39540 |
| f) | తదుపరి ఇంక్రిమెంట్ తేది | 01.03.2010 |

పై రెండు పద్ధతులలో ఇంక్రిమెంట్ తేదీకి వేతన నిర్ణయం చేయుట లాభదాయకంగా ఉంటుంది. ఇంక్రిమెంట్ తేదీ పాతదే కొనసాగుతుంది.

**గమనిక :** 24 సం॥ల స్కేలు పొందుతూ ప్రమోషన్ వచ్చిన వారికి ఈ నిబంధన వర్తించదు. వారికి ఎఫ్ఆర్ 22(ఎ) (i) నిబంధన వర్తిస్తుంది. దాని వలన ఒక ఇంక్రిమెంటు ప్రయోజనం లభిస్తుంది.